# చెల్లని రూపాయి

కొడవటిగంటి కుటుంబరావు

అది శివరామయ్యగారి దగ్గిరికి ఎట్లా వచ్చిందో తెలీదు, ఆ చెల్లని రూపాయి. మసకకళ్ల వాడు కను చీకట్లో కూడా ఆ రూపాయి చెల్లదని కనుక్కోవచ్చు—చెల్లని రూపాయల్లో కూడా మరీ వెధవ రూపాయి, ఆ చెల్లని రూపాయి! అది రూపాయల్లే మోగదు. దాని రంగే రూపాయి రంగు కాదు, అది రూపాయి బరువు లేదు. అది చేతికైనా రూపాయల్లే తగలదు. మందమతివాడు కూడా దాన్ని రూపాయి అనుకోటానికి వీల్లేదు—చెల్లని రూపాయల్లో కూడా అంత మరీ వెధవ రూపాయి, ఆ చెల్లని రూపాయి!

అది శివరామయ్య చేత పడటం మరీ అన్యాయం. శివరామయ్య సాధువు. భక్తిశూన్యమైన ప్రపంచంలో, ఈ కలియుగంలో మళ్లా ప్రహ్లాదుడల్లే పుట్టాడు శివరామయ్య. బియ్యే పాసయి రెండుమూడేళ్లు ప్లీడరీ చేసికూడా లౌకిక సంబంధాలన్నీ తెంచుకుని, ఆర్యధర్మాన్ని అవలంబించి, ఊరికే పైన పటారమూ లోపల లొటారమూ కాకుండా నిజంగా మనోవాక్కాయాల ధర్మరాజల్లే నడుచుకుంటూ, అన్నిరకాల వాళ్లచేతా ఔననిపించుకుంటున్నాడు శివరామయ్య.

అతన్ని తప్పపట్టినవాడు ఎటువచ్చీ మా శర్మ ఒక్కడే. (శర్మ కొక్కిరాయ వెధవ అని ఎవరెరగరు గనకా?) "వీడు మోక్షానికి అడ్డదార్లు వెతుకుతున్నాడల్లే ఉందిరా! ఈ శివరామయ్య షష్ఠిఘారంనించీ బియ్యేదాకా నోట్సుచదివి పరీక్షలు పాసయినఘటం!" అనేవాడు శర్మ-కొక్కిరాయ వెధవ!

శివరామయ్యది శుద్ధాంతఃకరణం. వాడు బంగారాన్ని మట్టిగా చూసేవాడు, పరస్త్రీని తల్లిలాగ చూసేవాడు. వాడి మనస్సు పరిపక్వమయింది—శర్మ వెయ్యిఅన్నగాక!

అటువంటి శివరామయ్య చేతికి వచ్చింది ఈ దిక్కుమాలిన చెల్లని రూపాయి.

ఆ చెల్లని రూపాయది ఎంతశక్తో! అది శివరామయ్యయొక్క పరిపక్వమైన మనస్సును సూటిగా, స్వయంగా, జయించగలిగి ఉండదు; అందుకని అది శివరామయ్యయొక్క అపరిపక్వమైన అంతరాత్మద్వారా శివరామయ్య మనస్సులో తెగులు ప్రవేశపెట్టింది. మామూలు రూపాయలను మట్టిగా చూసే శివరామయ్య ఎవరైనా "దేహి!" అని చెయిచాస్తే జేబులో ఎంత ఉన్నదీ లెక్కచూడకుండా తీసి ఇచ్చివేసే శివరామయ్య, ఈ మహానాటకంలో తను ధరించటానికి పూనుకున్న పాత్రయొక్క ప్రకృతిశీలాదులన్నీ సంపూర్ణంగా మరచిపోయి, ఆ రూపాయను ఎట్లా వదిలించుకోవటమా అని ఆరాటపడసాగాడు.

ఒకనాడు శివరామయ్య ఆ రూపాయతోపాటు మరొక మంచిరూపాయ జేబులో వేసుకుని, పెచ్చాల అంగడిలో కొన్నిసరుకులు కొని, నిర్లక్ష్యంగా జేబులోనించి రూపాయతీసి కోమటి కిస్తే, ఆ కోమటి దానివంక నన్నా చూడకుండా దాన్ని గల్లాలో వేసుకుని చిల్లరతీసి శివరామయ్య కిచ్చాడు. శివరామయ్య ఇవతలికి వచ్చి కొట్టుకుంటున్న గుండెతో జేబులోనించి మిగిలిన రూపాయ చూసుకుంటే అది ఆ దిక్కుమాలిన చెల్లనిరూపాయే! నిశ్చింతగా జేబులో ఉంది...ఇంతకూ భగవంతుడు శివరామయ్యపక్షాన లేడు.

ఆ తరవాత శివరామయ్య వంచనతో మరొకమెట్టు దిగాడు. చెల్లని రూపాయ ఒకజేబులోనూ మంచి రూపాయ మరొకజేబులోనూ పెట్టుకుని ఆయన బట్టలదుకాణంమీదికి వెళ్లి తనభార్యకు ఒకగజం రవిక గుడ్డకొని నిర్లక్ష్యంగా జేబులోనించి రూపాయ తీసి బల్లమీద పడేస్తేనే, రూపాయ ఖంగుమని మోగటంలో పూటా బయటపడుతుందని జ్ఞాపకం వచ్చి, గట్టిగా నాలుక కొరుక్కున్నాడు. కాని అది వృథాబాధ అయింది. బల్లమీద పడ్డరూపాయ బాగానే మోగింది. పూటారూపాయ ఉన్నది మరోజేబులో!

అక్కడ బయలుదేరి శివరామయ్య చెల్లనిరూపాయను మామూలుగా చేతికి అలవాటైన జేబులోకి మార్చి, పచారీదుకాణం మీదికి వెళ్లి, ఒకపాలడబ్బాకొని, ఏమీ ఎరగని వాడల్లే మాట్లాడకుండా ఆ పడనిరూపాయ తీసి ఆదుకాణదారు చేతిలో పెడితే, అతను ఎవరికో సమాధానం చెబుతూ ఆ రూపాయ మిగతారూపాయల్లో వేసుకున్నాడు. కాని మరుక్షణమే అన్ని రూపాయల మోతలోనూ ఆ పాపిష్టి చెల్లనిరూపాయమోత అపస్వరమల్లే అతని చెవికి

పోకిందో ఏమో, అతను పాముకరిచిన వాడల్లే ఉలిక్కిపడి, రూపాయల్లోకి ఇట్టేచూసి, చప్పున ఆపడని రూపాయను పైకి లాగి, “ఇది పడదు, స్వామీ! మరొకటిప్పించండి!” అని సవినయంగా అన్నాడు. అప్పుడు శివరామయ్య ఆశ్చర్యం నటించవలిసి వచ్చింది, నటించాడు నటించటము చేత శివరామయ్యకు, పాపం, చాలా కాని విద్య; కాని చేసిన ప్రయత్నం మెచ్చుకోదగినట్టుగానే ఉండింది.

“పూ! కాకూపామూ! ఎవరిచ్చారబ్బా!...సరే, నాదగ్గిరే ఉంచండి. నా దగ్గిర చిల్లర లేదు, తరవాత చిల్లర ఇచ్చి దాన్ని నేనే తీసుకుపోతానులే!” అని అనిచూశాడు శివరామయ్య. దుకాణదారు తక్కువతిన్న వాడు కాడు.

“డబ్బులెక్కడికిపోతై, స్వామీ. తరవాత ఇవ్వండీ! నాదగ్గిర ఇది కూడా ఎందుకూ?” అన్నాడతను.

ఆరూపాయ ఎక్కడా చెల్లలేదు. సినిమాలదగ్గిరా, కాఫీహోటళ్లలో, దుకాణాల్లో, పోస్టాఫీసులో, బాంకిలో — ఎక్కడా ఎవరూ తీసుకోలేదు. ఆ దిక్కుమాలిన చెల్లని రూపాయను.

రైలుస్టేషనులో బుకింగుక్లర్కు “ఈరూపాయ చెల్లదు. ఇంకొకటి ఇవ్వండి!” అన్నాడు మర్యాదగా.

“మంచిదేనే!” అన్నాడు శివరామయ్య అర్థంలేకుండా.

“కావాలంటే కత్తిరించి పూటా చూపిస్తాను!” అన్నాడు బుకింగు క్లర్కు....

ఆ రూపాయ మార్చాలని ప్రయత్నం చేసే వేళల్లో శివరామయ్య అవమానంపాలూ అపకీర్తిపాలూ అయినట్టు కనపడ్డాడు. అన్నిటికన్నా ముందు అడ్డమైన వాళ్ల దగ్గిరా ఆశ్చర్యం నటించటం ఆయన ప్రాణంమీదికి వచ్చింది. అతడి ఆశ్చర్యం అందరిమీదా పాకుతున్నట్టు లేదు. ఒకరిద్దరు మందహాసం కూడా చేశారు.

ఏమయినా సరే ఆ రూపాయను ఇకముందు డొక్కశుద్ధి అయిన వాళ్ల దగ్గిర బయటికి తియ్యకూడదని శివరామయ్య తీర్మానించుకున్నాడు.

ఇంతలో దేవుడు పంపినట్టు ఒక చిల్లిడబ్బుపట్టుకుని ఎవరో చందాకు వచ్చారు. ఆరూపాయను వదలించుకోవటానికి ఇంతకంటె మంచి అవకాశం ఏముందీ? కాని అదేదో భగవద్విషయకమైన చందా. ఒక్కరూపాయకోసం పాపం తెచ్చుకోవటంఎట్లా? శివరామయ్య అడబ్బాలో మంచి రూపాయ తెచ్చి వేశాడు....

“నెలజీతం ఇప్పించండి, అయ్యగారూ! ఇంటో గింజల్లేవు. ముసలాడు మంచమెక్కాడు. బుడ్డోడికి రేత్తిరినించీ గంజయినా లేదు.” అని అడిగింది పనిమనిషి. దాని కింకా నెలకాలేదు.

శివరామయ్య మనస్సు చిక్కబట్టి ఆదిక్కుమాలిన చెల్లనిరూపాయ దానిచేతిలో పెట్టాడు. అది కృతజ్ఞతతో పెట్టిన ప్రతిదణ్ణమూ శివరామయ్యకు ఒక్కొక్క బల్లెపుపోటల్లే ఉండటమేకాక ఆ విధవ రూపాయ వదిలినతృప్తి అతడికి కలగలేదు. ఆ రూపాయ తన్నంత సులభంగా వదలుతుందా! అది దానికిమాత్రం ఎట్లా మారుతుంది! ఆముసలిముండ ఎట్లాగో ఆరూపాయ తెచ్చి మళ్లీ తనమీద పారేస్తుంది.' “ఇది నేనిచ్చిన రూపాయ కాదు!” అనటానికి తనకు నోరు రాదు. పాపంకూడాను!—ఈ విధంగా మథనపడ్డాడు శివరామయ్య.

కాని ఆ పనిచేసేముండ ఆయన జోలికి మళ్లీ రాలేదు. విశ్వప్రయత్నం చేసినా ఆయనకు మారని ఆరూపాయ దానికి ఇట్టేమారి ఊరుకుంది!